అవినీతి, అక్రమాలపై చర్యలేవి!!

- షాడో వ్యవస్థను నియంత్రించలేరా!
- ఉద్యోగులపై ఉదాసీనత ఎందుకు!
- సాక్షిలో ప్రచురితమైన కథనాలపై కౌన్సిలర్ రామయ్య నిలదీత
- నీళ్లు నమిలిన అధికారులు
- సమస్యలపై ఏకరువు పెట్టిన కౌన్సిలర్లు


సాక్షి దినపత్రికను చూపిస్తూ ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ రామయ్య


అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ కోటేశ్వరరావు, సంజీవరెడ్డి

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘంలో అనేక అవినీతి, అక్రమాలు జరుగుతున్నా.. వాటిపై సాక్షి దినపత్రికలో కథనాలు వస్తున్నా.. సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోకుండా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటూ 25వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. తెనాలి పట్టణంలోని పలు సచివాలయాల్లో జరిగిన బదిలీల్లో కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడ్డారని.. దానికి సంబంధించిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని.. ఎందుకు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయరంటూ కౌన్సిలర్ రామయ్య సాక్షి దినపత్రికను చూపిస్తూ ప్రశ్నించారు. కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోయినా వేతనాలు ఎందుకు వేస్తున్నారని.. వారి పట్ల మీకు అంత ప్రేమ ఎందుకని ఆయన నిలదీశారు.

షాడోల పాలన ఎక్కువైంది..

తెనాలిలో షాడోల పాలన ఎక్కువైందని.. దానిని నియంత్రించాలని కౌన్సిలర్ రామయ్య సూచించారు. అటెండెన్స్ రిజిష్టర్లు తెప్పిస్తామని ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు హామీ ఇవ్వడంతో ఆయన శాంతిచారు. ఇంతలో కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, ఆవుల కోటయ్య, గుంటూరు కోటేశ్వరరావులు లేచి వార్డులో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని.. కనీసం వార్డుకు ముగ్గురు కార్మికులు కూడా పని చేయడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బదిలీ కార్మికుల పేరిట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దోపిడికి పాల్పడుతున్నారని.. కార్మికుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. వార్డుకు కనీసం ఇద్దరిని కేటాయించాలని కోరారు. 29 కార్మికుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ రాధిక తెలిపారు. త్వరలో పారిశుద్ధ్య సమస్య కొంత మేర పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.


అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

నీళ్లు నమిలిన అధికారులు..

బుర్రిపాలెం రోడ్డులో మురుగు కాలువలపై నిర్మిస్తున్న షాపులపై పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఆదర్శంగా ఉండాల్సిన అధికారులే కాలువలను అక్రమిస్తే చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. ప్రజలకు నీతులు చెప్పే అధికారులు ఇలా వ్యవహరించడం సరి కాదంటూ ధ్వజమెత్తారు. వెంటనే కాలువలపై నిర్మాణాలు జరగకుండా చూడాలని సూచించారు. దీంతో అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. కౌన్సిలర్లు తెలియజేసిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని చైర్‌పర్సన్ రాధిక ఆదేశించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వార్డులపై శీతకన్ను..

ఎస్సీ వార్డులంటే చిన్న చూపు ఎక్కువగా ఉందని.. తమ వార్డుల్లో ఇంత వరకూ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, దాసరి వీరవసంతరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఎందుకు కేటాయించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకం ప్రస్తుతం అమలులో లేదని.. మున్సిపల్ బడ్జెట్‌లో 14 శాతం నిధులను ఎస్సీ వార్డులకు కేటాయిస్తామని ఎంఈ శ్రీకాంత్ తెలిపారు. మున్సిపాలిటీలో జరిగే అవినీతిని అధికారులు కప్పిబుచ్చుతున్నారని.. ఉద్యోగులపై చర్యలు తీసుకోకపోతే సహించబోమని కౌన్సిలర్ రామయ్య హెచ్చరించారు. అనంతరం వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, షేక్ ఇస్మాయేల్, కుర్రా సుజాత, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణలు తమ వార్డులో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణలో నెలకొన్న లోపాలపై అధికారులను నిలదీశారు.

క్లుప్తంగా

పౌర హక్కుల దినోత్సవం



తెనాలి రూరల్: రూరల్ గ్రామం నందివెలుగు జాషువానగర్‌లో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి సంక్రమించిన ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో అంటరానితనం, అసమానతలు ఉండకూడదన్నారు. ఏ వ్యక్తినైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టడం, కుల మతాల పేరుతో దూషించడం నేరమన్నారు. పౌరుల హక్కులు కాపాడేందుకు చట్టాలు ఉన్నాయన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కూడా న్యాయ సలహాలు పొందవచ్చునని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా ముందు అధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వి.జాన్, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి శంకుస్థాపన



దావులూరు(కొల్లిపర): మండల పరిధి దావులూరు గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనుల శంకుస్థాపనను గురువారం గ్రామంలోని పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబటి సంధ్యారాణి మాట్లాడుతూ.. హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రోద్బలంతో జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా సహకారంతో జెడ్పీ జీఎఫ్ నిధుల నుంచి సుమారు రూ.8 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల యువత అధ్యక్షులు కోట మార్కెండేయులు, ఎంపీటీసీ అద్దంకి బోసుబాబు, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, కాంట్రాక్టర్ ఈదా హర్షవర్ధన్‌రెడ్డి, కొల్లూరు అశోక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్లు పంపిణీ



తెనాలి, తెనాలి అర్బన్: పట్టణంలోని జై భీమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలువురి మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటివరపు దేవయ్య సతీమణి దయామణి 8వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిలుగు పీటర్, శ్రీనివాస్, ఆశా, జై భీమ్ ఫెడరేషన్ టౌన్ అధ్యక్షులు గోవా కుమార్, ఎంపీటీసీ పేరం అరుణ ఉన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో ఫ్లోరోసిస్

జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి గిరిధర్‌కుమార్



ఫిరంగిపురం: పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా వాడటం ద్వారాకూడా ఫ్లోరోసిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెండాచెట్టు సెంటర్లోని ఉర్దూ పాఠశాలలో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిధర్ కుమార్ మాట్లాడుతూ బోరు నీటిని వాడుతున్న ప్రాంతాల్లో కూడా ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందని చెప్పారు. బ్లాక్ టీ, బ్లాక్ సాల్ట్‌వంటివి ఎక్కువగా తీసుకోవడం ద్వారాకూడా ఈవ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధిరాకుండా చూసుకోవచ్చని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన్, ఏఎన్‌ఎం భారతీ జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

దుగ్గిరాల: గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకోవాలని పంచాయతీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ సూచించారు. దుగ్గిరాల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఇంటి పన్నుల డేటా ఎంట్రీలను తనిఖీ చేశారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని గ్రామ సర్పంచ్ ఖుషిభాయ్, ఈఓ వివేకానందలకు సూచించారు. ఇంటి పన్నులను ఆగస్టు 10వ తేదీలోపు వసూలు చేసి తన కార్యాలయానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

విద్యారంగానికి అంబరీషుడు సేవలు ప్రశంసనీయం


సత్కార కార్యక్రమంలో అంబరీషుడు, సుమతీ దంపతులు

తెనాలి: గత నాలుగు దశాబ్దాలకు పైగా విద్యారంగ అభివృద్ధికి, ఉన్నత పాఠశాల ప్రగతికి ఇ.అంబరీషుడు చేసిన సేవలు ప్రశంసనీయమని గురువారం జరిగిన సభలో పలువురు పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో స్కూలు అసిస్టెంట్ (సోషల్)గా విధులు నిర్వహించిన అంబరీషుడు పదవీ విరమణ సత్కార సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కె.రాజారెడ్డి అధ్యక్షత వహించగా.. వార్డు కౌన్సిలర్ జి.మానస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అంబరీషుడు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు ఏవీ గోపాలరావు, నాయకుడు కనపర్తి బెన్‌హర్, పాఠశాల స్టాఫ్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, అంబరీషుడు కుమారుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్ అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అపర్ణస్వాతి దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత అంబరీషుడు, సుమతీ దంపతులను ఘనంగా సత్కరించారు.

అధ్వానంగా ఎరుకలపూడి రహదారి!



రూరల్ మండలం కఠెవరం నుంచి ఎరుకలపూడి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఈ రహదారి గుంతలమయంగా దర్శనమిస్తోంది. ఇటుగా గుంటూరుకు నిత్యం వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించి ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు, పలు కళాశాలలు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు ఈ దారి నుంచే వెళుతుంటాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ నిధులతో రహదారిని నిర్మించారు. వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో రోడ్డు ఎక్కడికక్కడ గుంతలమయమైంది. అధికారులు స్పందించి రహదారికి కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– తెనాలి టౌన్

కార్మికులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పోరుమామిళ్ల సుబ్బరాయుడు

తాడేపల్లిరూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 9వ తేదీన టూల్ డౌన్ నిర్వహించనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు స్పష్టం చేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకుల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పోరుమామిళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికుల వేతనాలను జీవో నెం. 36 ప్రకారం చెల్లించాలని, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని కోరుతూ ఆగస్టు 18న సమ్మె నోటీసును అందజేయనున్నామని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగ, కార్మికులకు పెండింగ్ బకాయిలపైన రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, మున్సిపల్ శాఖ మంత్రి గానీ నోరు మెదపకుండా ఉండడం అన్యాయమన్నారు. ఆగస్టు 6న ఉద్యోగ, కార్మిక సంఘాలు రాష్ట్రమంతా రౌండ్ టేబుల్ సమావేశాలు జరిపి మద్దతు కూడగడతామని, ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పనిముట్లను పక్కన పెట్టనున్నామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉప ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, శీలం వెంకట సుబ్బయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు పులగం మద్దిలేటి, భజేంత్రి శ్రీనివాస్, కార్యదర్శి సత్యనారాయణ, సమితి సభ్యులు అంకయ్య, ప్రతాప్, విఘ్నేష్, చిత్తరంజన్, శ్రీనివాసులు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ

తాడికొండ: కార్మికులంతా ఏకమై రాజధాని సామాజిక పింఛను రూ.5వేలు సాధించుకోవడం హర్షణీయమని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి అన్నారు. గురువారం తుళ్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పోరాటాల అనంతరం ఆగస్టు 1న రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు సామాజిక పింఛను రూ.5వేలు సాధించుకోవడం హర్షణీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులతోపాటు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టులో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. గతంలో నిలిపివేసిన సామాజిక పింఛను 121 జీఓ ద్వారా పునరుద్ధరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జనవరి నుంచి ప్రభుత్వం పెంచిన పింఛను ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు ఏడు నెలల పెన్షన్ బకాయిలు ఒకేసారి చెల్లించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు కె.గోపిరాజు, ఎన్.స్వప్నదేవి, బుజ్జి, వీరమ్మ, రజిని, కోటేశ్వరరావు, మేరి, నాగమణి, సీఐటీయూ నాయకులు పేరం బాబూరావు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

కొల్లిపర: వాతవరణ మార్పుల కారణంగా పశువులకు ముఖ్యంగా వచ్చే హీమోరేజిక్ సెప్టిసీమియా(హెచ్ఎస్) వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా వ్యాధిని నియంత్రించేందుకు పశువులకు తప్పని సరిగా ముందస్తుగా హెచ్ఎస్ టీకాను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.కె.ప్రభు పాడి రైతులకు సూచించారు. కృష్ణా నదిలో వరద ఉధృతి పెరగడంతో గురువారం మండల పరిధిలోని అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, లంక గ్రామంలోని పశువులకు హెచ్ఎస్ టీకాలను ఉచితంగా వేశారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి సిమెంట్ బస్తాల వితరణ

తెనాలి: పట్టణ నాజరుపేటలోని బుర్రిపాలెం రోడ్డు పాలాద్రి కాలవ లక్ష్మి నగర్‌లోని శ్రీ శరణాగతి గోష్టి ఆశ్రమానికి శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్రం నిర్వాహకులు ముద్దాభక్తుని రమణయ్య, ఆయన కుటుంబ సభ్యులు ఆశ్రమ ప్రహరీ నిర్మాణానికి 100 బస్తాల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులైన శ్రీనరేంద్ర రామానుజదాసస్వామికి గురువారం సిమెంటు బస్తాలను సమర్పించారు. తన్నీరు శ్రీనివాసరావు, విష్ణుమొలకల శ్యామసుందరరావు, తోట గోపి, తాడికొండ కిషోర్ పాల్గొన్నారు.


వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషాకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో లూథరన్ చర్చి నుంచి పాలడుగు కోటేశ్వరరావు ఇంటి వరకు విద్యుత్ వీధి స్తంభాలు, వీధి లైట్లను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశామని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, నాయకులు పంతగాని దాసు, జాలాది విజయేంద్రరావు, గుర్రంకొండ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పునరుద్ధరణకు వినతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలెం ఒకటో సచివాయంలో పారిశుద్ధ్య కార్మికులకు, ఆశాలకు, అంగన్‌వాడీలకు, రాజధాని రైతు కూలీలకు, వింతంతువులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ నాయకుడు ఆకుల ఉమామహేశ్వరరావు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి పింఛన్లు పునరుద్ధరణ కాలేదని, వారికి కూడా వీలైనంత త్వరితగతిన పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. నాయకులు నీలం అంకారావు, ఆకుల పానకాల రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యకు త్వరలో పరిష్కారం



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య త్వరలో పరిష్కారం కానుందని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను కార్మిక నాయకులు కె.స్టీవెన్, కె.ఆదినారాయణలతో కలసి సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలు యజమాని ఏసీసీ ముంబయి వారని, 1990లో చేసిన పొరపాటు వలన హెచ్ఎంపీ అనే కలకత్తా కంపెనీ సమస్యలను సృష్టించిందన్నారు. 32 సంవత్సరాలుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి త్వరలోనే పరిష్కారం జరగనుందని తెలిపారు. నాయకులు సుభాని, గంగాధర్, సుబ్బారావు, కార్మికులు ఇమాంబీ, రమాదేవి, శారమ్మ, భూలక్ష్మి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి ట్రయల్ రన్


గ్రామంలో పర్యటిస్తున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్కే తేజ

తెనాలి టౌన్: తెనాలి నియోజకవర్గంలోని కొలకలూరు గ్రామాన్ని పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్ల సమస్యలు ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ గ్రామంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా 90 శాతం మేర రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడం ప్రధాన సమస్యగా గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్కే తేజ మైలవరపుతో ఫోన్‌లో మాట్లాడి కొలకలూరు గ్రామాన్ని సందర్శించి డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ వీఆర్కే తేజ గురువారం గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం చేపడితే ఎలా ఉంటుందనే దానిపై అధికార బృందంతో ట్రయల్ రన్ వేయించారు. రెండు చోట్ల భూమిలోనే నీరు ఇంకిపోవడంపై ఆ శాఖ అధికారులు పరిశీలన చేశారు. ఆయన వెంట ఎంఈ ఎన్ఆర్‌జీఎస్ డైరెక్టర్ షణ్ముక్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్, డ్వామా పీడీ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవిడి.ప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, తదితరులు ఉన్నారు.

ముగిసిన డెంగీ మాసోత్సవాలు


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తెనాలి అర్బన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా తెనాలి పట్టణ, మండల సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాలలో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జులై 1 నుంచి 31వ తేదీ వరకూ జాతీయ డెంగీ మాసోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు రోజూ ర్యాలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామప్రసాద్, షేక్ రషీద్, షేక్ నవీద్, సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషపై అభిమానం పెరిగేలా బోధించాలి


విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఎండీ ఖాసిం

కొల్లిపర: ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉర్దూ భాషపై అభిమానం పెరిగేలా విద్యను బోధించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. మండల పరిధిలోని పిడపర్రు, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం 100 శాతం అమలయ్యేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. పిడపర్రులోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు షేక్ మోయిన్, కరీమున్నీసా తమ సొంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, గుర్తింపు కార్డులు అందజేయడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్యబ్రహ్మ ఆకుల వెంకయ్య చిరస్మరణీయుడు


కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న కళాకారులు

తెనాలి: జీవితమంతా విషాదం అలముకున్నప్పటికీ రంగస్థలం మీద చింతామణి నాటకంలోని శ్రీహరి పాత్రలో తన సహజ నటనతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన హాస్యబ్రహ్మ ఆకుల వెంకయ్య అని సంఘ సేవకుడు తన్నీరు శివశంకర్ అన్నారు. సుప్రసిద్ధ రంగస్థల నటుడు ఆకుల వెంకయ్య 25వ వర్ధంతిని నందులపేటలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. కళారంగానికి చెందిన పలువురు వెంకయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఆకుల వెంకయ్య కళారంగ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వెంకయ్య కుటుంబ సభ్యులు చీళ్ల వరలక్ష్మి, చీళ్ల గోపీనాథ్, చీళ్ల నాగేశ్వరరావు, కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, తాడికొండ జగన్మోహనరావు, కొప్పరాజు విజయ్, పాతూరి సుబ్రహ్మణ్యం, పాతూరి సుబ్రహ్మణ్య కవి, లక్కరాజు లక్ష్మణరావు, అయినాల మల్లేశ్వరరావు, వినుకొండ శ్రీరామ్మూర్తి, లక్ష్మీ తులసి, ఆరాధ్యుల ఆదినారాయణ, పలువురు రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాక్ ఎక్సర్‌సైజ్‌ను వివరిస్తున్న వెంకట్ దీపక్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో గురువారం సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం నిర్వహించారు. విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్‌దీపక్, మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సునామీ సన్నద్ధతపై 12 కోస్తా జిల్లాలోని ప్రభావిత మండల, గ్రామస్థాయి అధికారులతో మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించామని తెలిపారు. సునామీ, తుఫాన్ల పట్ల అధికారులు సంసిద్ధంగా ఉండాలని, ఎస్‌ఓపీ అమలు చేయడం, అందుబాటులోని వనరులు, సౌకర్యాలు, సాంకేతికతను ముందుగానే తెలుసుకోవడం వలన ప్రమాద స్థాయిని తగ్గించవచ్చని తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా అధికారులకు సునామీ హెచ్చరికలు జారీ చేసే విధానం, మండల స్థాయి అధికారులకు సమాచారం చేరవేయడం ప్రత్యక్షంగా చూపించామన్నారు. జిల్లా అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్, ప్రభుత్వ లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

దుగ్గిరాల: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఆపాలని సీపీఎం కార్మిక నాయకుడు జెట్టి బాల రాజు డిమాండ్ చేశారు. గురువారం దుగ్గిరాలలోని సెంట్రల్ వేర్ హౌస్ ముఠాకూలీలకు కరపత్రాలు పంచి అనంతరం బాల రాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున విద్యుత్ భారాలను మోపుతుందని ఇది అన్యాయమన్నారు. వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో మరియదాసు, పున్నారావు, యలమంద, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దుగ్గిరాల: దుగ్గిరాల లాకుల వద్ద గురువారం సాయంత్రం ట్రైనింగ్ ఎస్ఐ హర్ష ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనచోదకులు, ఆటో డ్రైవర్ల లైసెన్సులు, వాహన పత్రాలు పరిశీలించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.